# గెలుపు ఖాయం.. మెజార్టీయే లక్ష్యం

- బీఆర్‌ఎస్‌కు అండగా సబ్బండవర్గాలు
- సీఎం కేసీఆర్ పాలనలోనే అభివృద్ధి
- సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి
- పాలకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


సింగరాజుపల్లిలో బీఆర్‌ఎస్ శ్రేణులతో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల, నవంబర్ 2: దేశంలో ఎక్కడాలేని విధంగా సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలంతా బీఆర్‌ఎస్‌కు అండగా ఉన్నారని, ఈ ఎన్నికల్లో గెలుపు ఖాయమైనా మెజార్టీపై దృష్టి పెట్టాలని పాలకుర్తి నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని కోలుకొండ, సింగరాజుపల్లి కేంద్రాలుగా గురువారం పార్టీ కార్యకర్తలతో ఆయన సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు దేవరుప్పుల మండలంలో సాగు, తాగునీరు లేక ప్రజలు నానా ఇబ్బందులుపడ్డారని, రైతులు, కూలీలు ఉపాధి కోసం వలసబాట పట్టారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ సహకారంతో మండలంలోని యశ్వంతాపూర్, కోలుకొండ వాగులపై ఎనిమిది చెక్‌డ్యామ్‌లు నిర్మించడంతో సాగునీటి సమస్య పరిష్కారమైందన్నారు. 18 కిలోమీటర్ల మేర వాగు జీవనదిని తలపిస్తున్నదని ఎర్రబెల్లి తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ వివక్షకు గురికాగా, పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. మరోవైపు దేవాదుల రిజర్వాయర్ల ద్వారా అన్ని చెరువులు నింపుతున్నామని, రెండు పంటలకు సాగునీరు అందుతున్నదని వివరించారు.

**గెలుస్తున్నామనే ధీమా వీడి కష్టపడి పనిచేద్దాం**

ఈ ఎన్నికల్లో మన విజయం ఖాయమైనప్పటికీ ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి మెజార్టీ పెంచేలా కృషి చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మనం చేసిన పనులను రచ్చబండ వద్ద చర్చకు పెట్టాలని, మనం అందించిన సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు గుర్తుకు చేయాలన్నారు. దేవరుప్పుల మండలాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపాను, ఓట్లడిగే హక్కు మనకే ఉందన్నారు. అడ్రస్ లేని కాంగ్రెస్ పార్టీ నేతలు ఎన్నికలు రావడంతో ప్రజల వద్దకు వస్తున్నందున ప్రజలు ప్రశ్నించాలన్నారు. బూత్ లెవల్లో పనిచేస్తున్న నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి బీఆర్‌ఎస్ పార్టీకి, కారు గుర్తుకు ఓటేసేలా చూడాలన్నారు. ఈ 20 రోజులు మనకు కీలకమని, అనుక్షణం కార్యకర్తలు ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని ఎర్రబెల్లి కోరారు. మండల, గ్రామ స్థాయి నాయకుల సూచనలు పాటించాలన్నారు. ఇంకా అభివృద్ధి చేయాల్సిన పనులు ఉంటే దయన్న పక్షాన మీరే హామీ ఇవ్వండి.. పూర్తి చేసే బాధ్యతను తాను తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, మండల ఇన్‌చార్జి మనోహర్ రావు, నాయకులు పల్లా సుందరరాంరెడ్డి, చామల విక్రం రెడ్డి, లింగాల రమేశ్ రెడ్డి, కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, బస్వ మల్లేష్, ధరావత్ రాంసింగ్, కొల్లూరు సోమయ్య, చింత రవి, వంగ అర్జున్, కోతి ప్రవీణ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.


కోడూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి

# గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- అవినీతి కాంగ్రెస్‌కు, మతతత్వ బీజేపీకి గుణపాఠం చెప్పాలి
- బీఆర్‌ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి
- ఆత్మీయ సమ్మేళనాల్లో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

రఘునాథపల్లి, నవంబర్ 2: ఈ ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపిస్తే నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని బీఆర్‌ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని రామన్నగూడెం, కోడూర్, కన్నాయపల్లి, గబ్బెట, మల్లంపల్లి, శివాజీనగర్, కంచనపల్లి గ్రామాల్లో గురువారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎం కేసీఆర్ తనకు అవకాశం ఇచ్చారని, ప్రజలు నిండుమనసుతో ఆదరించాలని శ్రీహరి కోరారు. మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉంటున్న తాను ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నానని తెలిపారు. మంత్రి, డిప్యూటీ సీఎంగా పదవులు నిర్వహించి ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కోసం నిజాయితీగా పని చేశానని తెలిపారు. గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు లింగాలఘనపురం, రఘునాథపల్లి మండలాలను అభివృద్ధి చేసే అవకాశం లభించలేదన్నారు. ఈ రెండు మండలాలు నాడు జనగామ నియోజకవర్గంలో ఉండేవన్నారు. నేడు ఇవి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఉండడం వల్ల ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ప్రజలు ఆదరించి గెలిపిస్తే కోడూర్, కన్నాయపల్లి, గబ్బెట నుంచి డబుల్ రోడ్డు వేయడంతో పాటు చీటూర్ నుంచి జనగామ వరకు రహదారిని విస్తరిస్తానన్నారు. రామన్నగూడెం -కోడూర్ మధ్య ఉన్న కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలతో కుంగిందని, తాను గెలిచాక వంతెన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు.

**దేశంలో ఎక్కడలేని విధంగా అభివృద్ధి**

పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడలేని విధంగా రైతులకు ఉచితంగా 24 గంటల నాణ్యమైన విద్యుత్, రైతుబీమా, రైతుబంధు పథకాలు అమలు చేస్తున్నారని కడియం శ్రీహరి తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేస్తూ ఆదుకుంటున్నారని వివరించారు. దేశంలో హర్యానా, పంజాబ్ రాష్ట్రాలను మించి ధాన్యం పండించడంలో తెలంగాణ ముందుందన్నారు. ఎన్నికలు రావడంతో కాంగ్రెస్, బీజేపీ నాయకులు మాయమాటలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని శ్రీహరి విమర్శించారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని, ప్రజలు కారు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బొల్లం అజయ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వారాల రమేశ్‌యాదవ్, రైతుబంధు సమితి జిల్లా సభ్యులు మారుజోడు రాంబాబు, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోకల శివకుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మునిపట్ల విజయ్, నాయకులు చెంచు రమేశ్, మాజీ ఎంపీపీ వై కుమార్‌గౌడ్, లోనె శ్రవణ్, గైని శ్రీనివాస్, వడ్లకొండ శివప్రసాద్, ఎండీ రంజాన్, మడ్డపల్లి సునీత, ముక్క పరశురాములు, గవ్వాని నాగేశ్వర్‌రావు, శివరాత్రి కొమురయ్య, పుండ్రు సంజీవరెడ్డి పాల్గొన్నారు.


కోడూరులో బతుకమ్మలతో ర్యాలీగా వస్తున్న గ్రామస్తులు


పీఏసీఎస్ వైస్ చైర్మన్ మద్దికుంట రాధను అభినందిస్తున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## పీఏసీఎస్ వైస్ చైర్మన్‌కు బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా అభినందన

బచ్చన్నపేట, నవంబర్ 2 : బచ్చన్నపేట పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా గురువారం ఎన్నికైన లింగంపల్లి గ్రామానికి చెందిన డైరెక్టర్, బీఆర్ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు మద్దికుంట రాధను జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అభినందించారు. ఈ మేరకు గురువారం రాధ డైరెక్టర్లతో కలిసి జనగామలో పల్లాను కలువగా ఘనంగా సన్మానించి స్వీట్లు అందించారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సీఎం కేసీఆర్ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన వివరించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, డైరెక్టర్లు వేముల లక్ష్మణ్ గౌడ్, దాసారం శ్రీనివాస్, తాడిచెట్టు యాదమ్మ, గడిపె ప్రభాకర్, బేజాడి సిద్దులు, సిద్దిని రాములు, తరిగొప్పుల శ్రీనివాస్, నర్సిరెడ్డి, రాములు, కానుగంటి బాలచందర్, నిమ్మ శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# జనగామ రిటర్నింగ్ అధికారి కార్యాలయం తనిఖీ

- ఎన్నికల ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి సీహెచ్ శివలింగయ్య


నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి శివలింగయ్య, డీసీపీ సీతారాం

జనగామ చౌరస్తా, నవంబర్ 2 : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్ ఏరియాలోని జనగామ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఈఆర్వో) కార్యాలయాన్ని గురువారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య, వెస్ట్‌జోన్ డీసీపీ పీ సీతారాంతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ కోసం చేసిన ప్రత్యేక ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ దరఖాస్తుతో పాటు అభ్యర్థులు తప్పనిసరిగా సమర్పించాల్సిన ధ్రువపత్రాలు, నిబంధనల ప్రకారం రిటర్నింగ్ అధికారి పాటించాల్సిన నిబంధనలు, హెల్ప్ డెస్క్, ఆన్‌లైన్ నామినేషన్ల స్వీకరణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఇది వరకు నిర్వహించిన సమావేశం వివరాలపై సంబంధిత రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణను జిల్లా ఎన్నికల అధికారి శివలింగయ్య అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థులు, ప్రతిపాదకులు, ఇతరుల కోసం ఆర్వో కార్యాలయంలో మంచినీళ్లు, కుర్చీలు, టెంట్ అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని శివలింగయ్య ఆదేశించారు. అభ్యర్థులకు ఎదురయ్యే సందేహాలను ఆర్వోలు నివృత్తి చేసి పొరపాట్లు జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎన్నికల నోడల్ అధికారులు ఇస్మాయిల్, అనిల్ కుమార్, వినోద్ కుమార్, తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

# జిల్లావ్యాప్త తనిఖీల్లో రూ.2 కోట్ల 47 లక్షలు సీజ్

జనగామ చౌరస్తా, నవంబర్ 2 : శాసన సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని జనగామ, స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిబంధనల మేరకు నిర్వహించిన తనిఖీల్లో జిల్లా వ్యాప్తంగా రూ.2 కోట్ల 47 లక్షల నగదును సీజ్ చేశామని జిల్లా ఎన్నికల అధికారి సీహెచ్ శివలింగయ్య తెలిపారు. 48 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా సీజింగ్ కమిటీ ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి శివలింగయ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగయ్య మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నమోదైన కేసుల్లో 47 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. మరో కేసు ఐటీ శాఖ పరిధిలో ఉందని పేర్కొన్నారు. రూ.10 లక్షలు పైబడిన కేసుల వివరాలను ఆదాయపు పన్నుశాఖకు రెఫర్ చేస్తామని తెలిపారు. పట్టుబడిన సొమ్ము వివరాలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఎన్నికల అధికారి శివలింగయ్య ఆదేశించారు. సీజింగ్ కమిటీ బాధ్యులు రోజువారి నివేదికలను సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో వెస్ట్‌జోన్ డీసీపీ పీ సీతారాం, సహాయ ఎన్నికల అధికారి సుహాసిని, సీజింగ్ కమిటీ సభ్యులు అనిల్ కుమార్, రాజేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కలెక్టరేట్ ఏవో రవీందర్ పాల్గొన్నారు.


సోమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

# పాలకుర్తి సోమేశ్వరాలయంలో ఆరుద్రోత్సవం

- 108 లీటర్ల ఆవు పాలతో స్వామివారికి అభిషేకం

పాలకుర్తి, నవంబర్ 2: మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం రాత్రి ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆరుద్రోత్సవం నిర్వహించారు. మేళతాళాలు అర్చకుల వేద మంత్రోచ్ఛారణల మధ్య మహా వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఏకాదశ రుద్రాభిషేకం కొనసాగించారు. 108 లీటర్ల ఆవు పాలతో స్వామివారిని అభిషేకించారు. అనంతరం గర్భాలయంలో దీపోత్సవం చేపట్టారు. సోమేశ్వరుడిని పుష్పాలతో అలంకరించిన అర్చకులు విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.